సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 14 । జనవరి । 2023



కందిపప్పు.. అపోహలు తప్ప

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ ద్వారా సరఫరా చేసిన కందిపప్పుపై ఎలాంటి ఆపోహలు వద్దని సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు. -IIలో..



నాటు తుపాకులు స్వాధీనం

నాటుతుపాకులు స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అన్నమయ్య జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. -IIలో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.6/13.8

జిల్లాలో శుక్రవారం 13.8 - 32.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

కడప సిటీ : జిల్లా ప్రజలకు పలువురు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ విజయ రామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జేసీ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్సీలు,శాసనసభ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు, ప్రజలకు సంతృప్త స్థాయిలో అందడంలో నూతన సంవత్సర ఆరంభానికి ముందే జిల్లాలో సంక్రాంతి కళ సంతరించికుందని వారు అభిప్రాయ పడ్డారు.భోగి మంటల వెచ్చటి వెలుగులు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, మకర సంక్రాంతి కాంతుల్లో ప్రతీ ఇల్లు సంక్షేమ సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని, కనుమ పూజలతో పల్లె సీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని వారు ఆకాంక్షించారు. అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు.

అగ్నిపథ్ అభ్యర్థులకు ఫిబ్రవరిలో రాతపరీక్షలు

కడప స్పోర్ట్స్: అగ్నిపథ్ పథకం కింద భారతీయ వాయుసేనలో అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి నెలలో రాతపరీక్ష, మెడికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. గ్రూప్–వై/మెడికల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి 4,5 తేదీల్లో చెన్నైలోని తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, రాతపరీక్ష, అడాప్టబులిటీ టెస్ట్–1, అడాప్టబులిటీ టెస్ట్–2, మెడి కల్ అపాయింట్‌మెంట్స్ నిర్వహిస్తారని తెలిపారు. గ్రూప్–వై/మెడికల్ అసిస్టెంట్ (డిప్లొమా/ఫార్మసీ నందు బీఎస్సీ చేసిన) అభ్యర్థులకు ఫిబ్రవరి 7, 8 తేదీల్లో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, రాతపరీక్ష, అడాప్టబులిటీ టెస్ట్–1, అడాప్టబులిటీ టెస్ట్–2, మెడికల్ అపాయింట్‌మెంట్స్ నిర్వహిస్తారని చెప్పారు.

ప్రశాంతంగా అంగన్వాడీ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప డివిజన్ పరిధిలోని కడప అర్బన్, రూరల్, కమలాపురం, సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాల పోస్టులకు శుక్రవారం ప్రశాంతంగా ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ సందర్భంగా కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి ఆర్డీఓ మాట్లాడుతూ ఎనిమిది మంది కార్యకర్తలు, 24 మంది ఆయాల నియామకాలకోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఎవరూ ఎలాంటి ప్రలోభాలకు గురి కారాదని, అర్హులైన వారితో నియామకాలు చేపడతామని ఆయన వివరించారు. త్వరలో ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పీడీ రమాదేవి, అడిషనల్ డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరరావు, సీడీపీఓలు సునంద, శ్రీదేవి, సుజాామణి, సూపర్‌వైజర్లు నాగరత్న, రేణుక, రెడ్డెమ్మ, పద్మజ, దీప తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ డోలిక.. ఆనందాల వేడుక

- పెద్దపండుగ నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు
- బంధుమిత్రులతో కళకళలాడుతున్న తెలుగు లోగిళ్లు
- నేడు భోగభాగ్యాల భోగి





కడప కల్చరల్ / మదనపల్లె సిటీ: కొత్త సంవత్సరంలో తొలిసారిగా వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల ఈ పండుగ నిర్వహణలో ప్రత్యేకత ఉంది. ఈ పండుగ పూర్తిగా పల్లెటూరి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. మంచుకురిసే ఈ మాసంలో వచ్చే సంక్రాంతికి తొలిరోజు ఇళ్ల ముందు కళ్లాపి చల్లి ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టడం, రెండోరోజు పెద్దల పండుగగా పితదేవతలకు సమర్పణలు చేయడం, మూడవరోజు పాడిపంటల నిచ్చే పశువులకు పూజలు చేసి గ్రామ వాసుల జీవితంలో మమైకమైన వాటిని గౌరవించి ఆరాధించడం సంప్రదాయంగా వస్తోంది. తెల్లవారుజామునే భోగి స్నానాలు, ఇళ్ల ముందు హరిదాసులు, గంగిరెద్దులు, పశువుల పూజలు, కొత్త అల్లుళ్ల సందడి, ముఖ్యంగా గ్రామసీమల్లో చుట్టాలతో ఇళ్లన్నీ కొత్త కళను సంతరించుకుంటాయి. పల్లెలు, పట్టణాలు, నగరాల్లో సందడే సందడి. మూడేళ్ల తర్వాత పూర్తి స్థాయిలో పండుగ జరుపుకుంటుండడంతో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఈ సందర్భంగా నేటి తరం వారికి సంక్రాంతి సంప్రదాయాల గురించి ప్రత్యేక కథనం.

ఆయుస్సు పెంచే భోగిపండ్లు



ఈ పండుగ ప్రధానంగా సూర్యుడి గమనంపై ఆధారపడి ఉంటుంది. ధనుస్సు నుంచి మకర రాశిలోకి సూర్యుడు ప్రవేశిస్తాడు గనుక మకర సంక్రాంతి అంటారు. ముందురోజు బోగిపండ్లుగా చెరుకు గడలు, రేగిపండ్లతో పిల్లలకు తలస్నానాలు చేయిస్తారు.ఇందులో రేగుపండ్లు విష్ణువుకు ప్రీతికరమంటారు. దుష్టశక్తులు, ఎవరి దృష్టి తమ పిల్లలపై పడకూడదని, ఆయుస్సు పెరగాలని ఇలా చేస్తారు.రేగుపండు గుండ్రంగా, ఎర్రగా ఉంటుంది గనుక సూర్యుని ప్రతీకగా చెబుతారు. అందులోని సి–విటమిన్ తల వెంట్రుకలకు మేలు చేస్తుందన్న ఆరోగ్య రహస్యం కూడా ఉంది.

భూమాత సప్త వర్ణాలతో..



దాదాపు నెల రోజుల ముందు నుంచి ముగ్గులు సంక్రాంతికి స్వాగతం పలుకుతాయి. మధ్య చుక్కను సూర్యుడుగా, చుట్టూ ఉన్న చుక్కలు గ్రహాలుగా భావించి ప్రపంచమంతా వాటిపైనే ఆధారపడి ఉందన్న వైజ్ఞానిక సత్యాన్ని చెబుతూ చుక్కల ముగ్గులను తీర్చిదిద్దుతారు. రంగవల్లులతో భూమాత సప్తవర్ణాలతో శోభిల్లుతుంది. ముగ్గులు వేయడంతో శారీరక వ్యాయామం చేసినట్లువుతుంది. జిల్లాలో పేడ దొరకడం కష్టంగా ఉన్నా పేడరంగు వాడి ముగ్గులు వేస్తారు. పేడలో వ్యాధి నిరోధక గుణం ఉండడంతో ఈ సీజన్‌లో చలి, చెమ్మలతో పెరిగే దోమలు, వాటి ద్వారా వచ్చే రోగాలు నయమవుతాయి గనుక ఇళ్ల ముందు ధనుర్మాసం నుంచి మకర సంక్రాంతి వరకు పేడతో కళ్లాపి చల్లుకుంటారు. వేసిన ముగ్గు మధ్యలో పేడ ముద్దతో గొబ్బెమ్మను ఏర్పాటు చేసి గుమ్మడి లేదా బీర పువ్వును ఉంచుతారు. గొబ్బెమ్మను గౌరీమాతగా భావిస్తూ ఆ ఇంటి రక్షణ బాధ్యత ఆమెకు అప్పగించినట్లు భావిస్తారు.

హరిదాసుల సందడి



సంక్రాంతిలో వైష్ణవ ప్రధానమైన పూజలు ఎక్కువగా నిర్వహిస్తారు. అందుకే శ్రీ మహా విష్ణువు (హరి)ను స్తుతిస్తూ హరిదాసులుగానం చేస్తూ వైష్ణవ సంప్రదాయాన్ని ప్రాచుర్యంలోకి తెస్తుంటారు. సంక్రాంతి ప్రధానంగా వ్యవసాయ సంబంధమైన పండుగ. అందుకే మూడో రోజు కనుమ పండుగ సందర్భంగా గ్రామసీమల్లో తమకు పాడి పంటల విషయంలో ఎంతో సహకరించే ఎద్దులు, గోమాతలను అలంకరించి పూజలు చేసి కతజ్ఞతలు చెల్లిస్తారు. ఎద్దులను నందీశ్వరునిగా, గోమాతను సకల దేవతల నిలయంగా భావిస్తారు. మన జిల్లా వ్యవసాయ ప్రధానమైనది గనుక పశువుల పండుగను ఘనంగా నిర్వహిస్తారు. గ్రహాల్లో ప్రధానమైన సూర్యుడి ఆధారంగానే ఇతర గ్రహాల గమనం ఉంటుందని సైన్స్ చెబుతోంది. దాన్ని ఉదహరిస్తూ గాలిపటం దారాలను ఉపయోగించి పతంగులను ఎగురవేస్తారు. పాఠశాలలకు సెలవులు కావడంతో అందరూ జట్లుజట్లుగా మైదానాలకు వెళ్లి పతంగులు ఎగురవేస్తూ సరాదాగా గడుపుతారు.

పెద్దలకు పూజలు

రెండవరోజైన మకర సంక్రాంతినాడు పితృతర్పణాలు సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. తమ ఉన్నతికి కారణమైన పిత దేవతలను సంతప్తి పరిచేందుకు పలు ప్రత్యేక పూజలు చేసి నూతన వస్త్రాలు, పిండి వంటలు సమర్పిస్తారు. జిల్లాలో ఈ సందర్భంగా పెద్దల పండుగను ఘనంగా నిర్వహిస్తారు.

భోగి మంటలు



సంక్రాంతికి తొలి పండుగ భోగి. ఈ సమయంలో చలి ఎక్కువగా ఉంటుంది గనుక చలి మంటలు వేసుకుంటారు.ఈ సంవత్సరం చలి మరి తీవ్రంగా ఉండడంతో చలి(భోగి)మంటలు ముందే వెలిగాయి. సంవత్సరానికి ఒకసారి ఇంటిలోని పనికిరాని వస్తువులను బయట పడేసి ఆ చెత్త మిగతా వారికి ఇబ్బంది కలగకుండా భోగి పండుగ రోజు మంటల్లో వేస్తారు. దీంతో ఇల్లు శుభ్రమవుతుంది. జిల్లాలో పల్లె నుంచి నగరం వరకు, పసివారి నుంచి పండు ముసలి వారి వరకు భోగి మంటలు వేసుకుంటారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం





పోలీస్ స్పోర్ట్స్ పతాకాన్ని పోలీసులకు అందజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, గౌరవవందనం చేస్తున్న పోలీస్ సబ్ డివిజన్ జట్లు

- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్
- ముగిసిన పోలీస్ స్పోర్ట్స్ మీట్

కడప అర్బన్: నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి క్రీడల్లో పాల్గొనడం ద్వారా సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యం, ఫిట్‌నెస్ లభిస్తుందనీ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి ప్రారంభమైన పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2023 శుక్రవారంతో ముగిసింది. కడపలోని పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన ముగింపు వేడుకలకు జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత 6 పోలీస్ సబ్‌డివిజన్‌ల నుంచి పాల్గొన్న పోలీసు క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డు, కానిస్టేబుల్ మొదలు డీఎస్పీ స్థాయి అధికారుల వరకూ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడం, క్రీడాస్ఫూర్తి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రతిరోజూ చురుకుగా విధులు నిర్వర్తించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ ఏడాది క్రీడల్లో మహిళా పోలీసు సిబ్బంది భాగస్వామ్యం అధికంగా వుండటం శుభపరిణామమని ఎస్పీ అన్నారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలనీ జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ బి. రమణయ్య, జిల్లాలోని డీఎస్పీలు, ఆర్‌ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గాను దర్శించుకున్న శంకర్

కడప కల్చరల్ : కడప నగరంలోని ప్రముఖ సూఫీ క్షేత్రం అమీన్‌పీర్(పెద్ద) దర్గాను ప్రముఖ సినీ దర్శకుడు శంకర్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆర్ట్ డైరెక్టర్ ముత్తురాజు, అసోసియేట్ డైరెక్టర్ భరత్, కో డైరెక్టర్ సుందర్‌రాజ్‌లతో కలిసి వచ్చిన ఆయనకు దర్గా ముజావర్ అమీర్ స్వాగతం పలికారు. దర్గా సంప్రదాయంగా వారికి పేటా చుట్టి సాంప్రదాయ వస్త్రాలు ధరింపజేశారు. తొలుత ఆయన దర్గాలోని ప్రధాన గురువుల మజార్‌ను, అనంతరం ఇతర గురువుల మజార్ల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. హజరత్ అమీన్ పీర్ సాహెబ్ మజార్ వద్ద కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ముజావర్ అమీర్ వారికి దర్గా చరిత్ర, విశిష్టతలను వివరించారు. ఫాతెహా చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.




పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సినీ దర్శకుడు శంకర్ తదితరులు

చేతిరాత..విజయ విధాత

- టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఆసన్నమైన సమయం
- విద్యార్థులు దస్తూరిపై సాధన చేయాలంటున్న నిపుణులు

రాజంపేట టౌన్: టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు టైమ్‌టేబుల్ కూడా వచ్చేసింది. అత్యుత్తమ మార్కులు సాధించి మంచి మార్కులు, గ్రేడింగ్ పాయింట్లతో ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో అనేక మంది విద్యార్థులు ప్రణాళికను సైతం రూపొందించుకొని చదువడం ప్రారంభించారు. అయితే ఏడాది పాటు చదివిన విషయాలను జవాబు పత్రంపై రాసే విధానం వల్ల కూడా మార్కులు, గ్రేడింగ్ పాయింట్లు ఆధారపడి ఉంటాయి. అయితే ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించే విద్యార్థులు తక్కువ మంది ఉంటారు. పరీక్షల్లో ప్రశ్నలకు సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో చేతిరాత కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చేతిరాత నిపుణులు సూచిస్తున్నారు. చేతిరాత బాగుంటే మూల్యాంకనం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు వేస్తారు. దస్తూరి బాగా లేకపోతే.. సమాధానం అర్థకాక ఒకమార్కు లేదా అర మార్కు అయినా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ ప్రభావం గ్రేడింగ్ పాయింట్స్, మార్కులపై పడుతుంది. అందువల్ల విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం వుంది. పరీక్షలకు రెండు నెలలకు పైగా సమయం ఉన్నందున విద్యార్థులు రోజుకు అర గంట అయినా చేతిరాతపై సాధన చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



ఇవీ సూచనలు..

- ప్రతి విద్యార్థి ఆన్సర్‌షీట్ (బుక్‌లెట్)లో సమాధానాలను స్పష్టంగా రాయాలి.
- నాలుగు వైపులా మార్జిన్లు (బార్డర్లు) వేసుకుంటే చూసేందుకు అందంగా ఉంటుంది.
- ఒకలైనుకు మరో లైనుకు సెంటీమీటర్ గ్యాప్ ఇవ్వాలి.
- పదానికి, పదానికి తగనంత (ఒకటి లేదా రెండు అక్షరాల) స్పేస్ ఇవ్వాలి.
- బుక్‌లెట్‌లో వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుసక్రమంలో ఉండాలి.
- బొటన వేలు, మూడో వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది.
- ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై కూడా పడుతుంది.
- మనసు ప్రశాంతంగా ఉంటే చేతిరాత చక్కగా వస్తోంది.

సాధనతోనే గుండ్రటి అక్షరాలు సాధ్యం



చక్కటి చేతిరాత సాధనతోనే సాధ్యం కాగలదు. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు అక్షరాలను అందంగా రాసేందుకు సమయం కేటాయించుకోవాలి. చాలా మంది తొలి ప్రశ్నకు గుండ్రటి అక్షరాలతో సమాధానం రాస్తారు. తరువాత సమయం అయిపోతుందన్న ఆందోళనతో వేగంగా రాయడం ప్రారంభిస్తారు. అందువల్ల గుండ్రటి అక్షరాలు కుదరవు. ఈ ప్రభావం మార్కులపై పడుతుంది. అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి.

–కాశిగారి ప్రసాద్, చేతిరాత నిపుణులు, అసోసియేట్ ప్రొఫెసర్, ఏఐటీఎస్, రాజంపేట

పోలీసుల శిక్షణా సంస్థ ఏర్పాటుకు స్థల పరిశీలన

రామాపురం: అన్నమయ్య జిల్లా రామాపురం మండలం గువ్వలచెరువు గ్రామ సమీపంలో జిల్లా పోలీసు శిక్షణ సంస్థ ఏర్పాటుకు సంబంధించి జిల్లా అడిషనల్ ఎస్పీ రాజకమల్ స్థల పరిశీలన చేశారు. ఇప్పటికే గాలివీడు, రాయచోటి సమీపాల్లోని ప్రభుత్వభూములను కూడా పరిశీలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గువ్వలచెరువు సమీపంలోని శుక్రవారం సర్వే నంబర్ 109లో 274 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు అడిషనల్ డీఎస్పీ చెప్పారు.దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్ పంపుతామని తెలిపారు.రాయచోటి డీఎస్పీ శ్రీధర్, లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, రామాపురం ఎస్ఐ కొండారెడ్డి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, గ్రామ రెవెన్యూ అధికారి ఫాతిమా పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ రాజకమల్

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9010224479, 9705907418, 9912440776

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

క్లుప్తంగా

మద్యం బాటిళ్లు స్వాధీనం

కమలాపురం : మండల పరిధిలోని పొడదుర్తికి చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు రవి శంకర్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. శుక్రవారం బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలసి బెల్ట్‌షాపు పై దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి 20 మద్యం క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

170 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

గోపవరం : బద్వేలు బైపాస్ రోడ్డులోని గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 170 బస్తాల రేషన్ బియ్యాన్ని కడప విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోడౌన్‌లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు ముందస్తు సమాచారంతో శుక్రవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. బద్వేలు పట్టణానికి చెందిన దర్శి వెంకటేశ్వర్లు రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసేందుకు గోడౌన్‌లో స్టాకు నిల్వ ఉంచారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కాగా ఇదే గోడౌన్‌లో నెల రోజుల వ్యవధిలోనే మూడు దఫాలు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి పెద్ద సంఖ్యలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. సంబంధిత వ్యక్తిపై పలు దఫాలుగా కేసులు కూడా నమోదయ్యాయి. అయినప్పటికీ రేషన్ బియ్యం అక్రమ రవాణాను ఆపకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఒకరికి గాయాలు



వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని బుగ్గలేటిపల్లెలో రాయచోటికి వెళుతున్న లారీని వెనుకవైపు నుంచి క్యాంపర్ వాహనం ఢీకొంది. సీకే దిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి కథనం మేరకు....రాయచోటి వైపునకు వెళుతున్న లారీని క్యాంపర్ వాహనం వెనుకవైపు నుంచి అతి వేగంగా వచ్చి ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో కమలాపురానికి చెందిన క్యాంపర్ డ్రైవర్ వెంకటేశ్ గాయాలతో బయటపడ్డాడు. కాగా ఇతను క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో ఫైర్ సిబ్బందితోపాటు తాముస్థానికులతో కలిసి తీవ్రంగా శ్రమించి బయటికి తీసి రిమ్స్‌కు తరలించామన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కందిపప్పు.. అపోహలు తప్పు

ప్రతి చౌకదుకాణంలో అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఆదేశాలు



చౌక దుకాణాలలో అందిస్తున్న కందిపప్పు

ప్రొద్దుటూరు : చౌకదుకాణాల ద్వారా ప్రస్తుతం అందిస్తున్న కంది పప్పుకు పూర్తి డిమాండ్ పెరిగింది. కందిపప్పు నాణ్యత బాగుండటంతో రేషన్ కార్డుదారులు కొనుగోలుకు ఉత్సాహం చూపుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 5,76,847 రేషన్‌కార్డులు ఉన్నాయి. 11 పౌరసరఫరాల సంస్థ గోడౌన్ల పరిధిలో జనవరి నెలకు గాను జిల్లాకు 650 మెట్రిక్ టన్నుల కందిపప్పును ప్రభుత్వం మంజూరు చేసింది. ఈనెల ప్రతి చౌకదుకాణ డీలర్ తప్పనిసరిగా డీడీ చెల్లించి కందిపప్పును తీసుకెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు డీలర్లందరూ కందిపప్పుకు డీడీలు చెల్లించి దిగుమతి చేసుకున్నారు. ఎండీయూల ద్వారా ఇంటింటికి వెళ్లి కందిపప్పుతోపాటు బియ్యం, చక్కెరను అందిస్తున్నారు. సంక్రాంతి పండుగ వేళ మూడు రకాల వస్తువులను పంపిణీ చేయడం పట్ల కార్డుదారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కందిపప్పుకు డిమాండ్

కందిపప్పు నాణ్యతగా ఉండటంతో కార్డుదారుల నుంచి డిమాండ్ పెరిగింది. వాస్తవానికి బయటి మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.120 నుంచి రూ.130 వరకు ఉంది. చౌకదుకాణాల ద్వారా కిలో కందిపప్పు రూ.67 మాత్రమే అందిస్తుండటంతో పేదలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కందిపప్పు నాణ్యతపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తుండటంతో జిల్లా అధికారులు ఆయా స్టాక్ పాయింట్ల పరిధిలో ప్రత్యేకంగా కందిపప్పును కార్డుదారులచే వండించి చూపారు.

నాణ్యత బాగుంది

– కందిపప్పు ఉడికించి ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు

కడప అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ ద్వారా సరఫరా చేసిన కందిపప్పు చాలా నాణ్యమైనది.. దీనిపై అపోహలు వద్దని సివిల్ సప్లయ్ డీఎం అర్జున్‌రావు, డీఎస్‌ఓ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. చౌక దుకాణం షాపుల ద్వారా సరఫరా చేసిన కందిపప్పు ఉడకడం లేదనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సివిల్ సప్లయ్ ఎండీ ఆదేశాల మేరకు శుక్రవారం డీఎం అర్జున్ రావు, డీఎస్‌ఓ సుబ్బారెడ్డిలు కడప నగరంలోని ఓ చౌకదుకాణం షాపు వద్దకు వెళ్లి లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతోపాటు వారి సమక్షంలోనే కుక్కర్‌లో కందిపప్పు ఉడికించి చూపించారు. వారి సమక్షంలో తిని చూపించడంతోపాటు వారికి కూడా తినిపించి రుచి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు మహిళలంతా సంతృప్తిని వ్యక్త పరిచారు. కొందరు కావాలని పనిగట్టుకుని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ఇలాంటి ఆరోపణలను ఎవరు కూడా నమ్మవద్దని వారికి అవగాహన కల్పించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సివిల్ సప్లయ్ డీఎం అర్జున్ రావు, డీఎస్‌ఓ సుబ్బారెడ్డి



అధికారులు ఉడికించిన కందిపప్పు

నాణ్యత చాలా బాగుంది



చౌకదుకాణాల ద్వారా అందిస్తున్న కంది పప్పు నాణ్యత చాలా బాగుంది. స్వయంగా వండి చూశాం. మార్కెట్‌లో కందిపప్పులాగే నాణ్యతగా ఉంది. బయటి మార్కెట్‌లో ఎక్కువ ధర పెట్టి కొనలేక ఇబ్బందులు పడుతున్నాం.

– మీనా, గృహిణి, ప్రొద్దుటూరు

మార్కెట్‌లో ధర రెండింతలుగా ఉంది



చౌక దుకాణాల్లో రూ.67 కిలో కందిపప్పును ఇచ్చారు. మార్కెట్‌లో రూ.130 పలుకుతోంది. అంత ధర పెట్టి పప్పు తినలేం. పురుగులు లేకుండా కందిపప్పు నాణ్యతగా ఉంది.

– ఆయేషా, గృహిణి, ప్రొద్దుటూరు

ఈనెలలో ఎక్కువగా సరఫరా చేశాం

ఈనెలలో జిల్లా వ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో రేషన్ కార్డులకు కంది పప్పును సరఫరా చేశాం. గత నెలలో అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు కొన్ని చౌక దుకాణాలకు మాత్రమే కందిపప్పు ఇవ్వగా... ఈ మారు ప్రతి కార్డుదారునికి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాకు 650 మెట్రిక్ టన్నుల కందిపప్పు, వంద టన్నుల చక్కెర సరఫరా అయింది.

– డి.అర్జున్ రావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

ఐసీఏఆర్ పరీక్షల్లో జాతీయస్థాయి రెండో ర్యాంకు



మాచనూరు రవితేజ

మైదుకూరు : మైదుకూరుకు చెందిన మాచనూరు రవితేజ అనే యువకుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్–ఐకార్)లో నిర్వహించిన ఉద్యోగ పరీక్షల్లో జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. ఈ క్రమంలో శాస్త్రవేత్తగా నియమితులయ్యాడు. వైద్య ఆరోగ్య శాఖ విస్తరణ అధికారిగా పనిచేస్తున్న మాచనూరు రాఘవయ్య కుమారుడు రవితేజ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్ ఎమ్మెస్సీలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఢిల్లీలో పీహెచ్‌డీ చేసిన అనంతరం ఇటీవల శాస్త్రవేత్తల నియామకం కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లో దేశంలో రెండో ర్యాంకు సాధించి ఐకార్‌లో శాస్త్రవేత్తగా నియమితుడయ్యాడు.

నేడు పుష్పగిరిలో గోదా కళ్యాణం

వల్లూరు : పంచ నదీ సంగమంగా, ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న పుష్పగిరిలో భోగి పండుగ నాడైన శనివారం గోదా దేవి కళ్యాణం అత్యంత వైభవోపేతంగా జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి బిందె తీర్థ సేవ, అనంతరం సహస్ర నామార్చన, ధనుర్మాస ఆరాధన జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 10 గంటలకు గోదా కళ్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

బాలికల అదృశ్యం కేసు సుఖాంతం

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు మైనర్ బాలికల అదృశ్యం కేసు సుఖాంతమైంది. విద్యార్థినులు మైదుకూరులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు శుక్రవారం వారిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నెల 11న పాఠశాలకు వెళ్లిన ఇరువురు విద్యార్థినులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో బయటకు వచ్చి కనిపించకుండా పోవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు బాలికల ఆచూకీ కోసం బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సమయంలో ఫోన్ కాల్‌డేటా ఆధారంగా విద్యార్థినులలో ఒకరి సమీప బంధువు విజయవాడలో ఉంటుండగా అక్కడికి వెళ్ళినట్లు గుర్తించారు. అయితే శుక్రవారం సాయంత్రం విద్యార్థినులలో ఒకరు తాము మైదుకూరులో ఉన్నామని, బద్వేలుకు వస్తున్నామని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు విషయాన్ని పోలీసులకు తెలిపారు. వెంటనే అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వెంకటరమణలు మైదుకూరుకు వెళ్ళి లా బాలికలను బద్వేలుకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో మిస్సింగ్ కేసు సుఖాంతమైంది.

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో
జిల్లా క్రీడాకారుల హవా



పతకాలు సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు

17 పతకాలు కైవసం

కడప స్పోర్ట్స్ : విశాఖపట్నంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ శాప్ లీగ్ జిమ్నాస్టిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. వివిధ విభాగాల్లో బాల బాలికలు మొత్తం 17 పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఉత్తమ శిక్షణ అందించిన జిమ్నాస్టిక్స్ కోచ్ ఎస్. తమీమ్ అన్సారీని ఆయన అభినందించారు.

బాలుర విభాగం : ప్రణీత్ (రజతం), శశాంక్ (కాంస్యం), నిఖిల్ (కాంస్యం)

బాలికలు : హిమవర్షిణి(రజతం), సరస్వతి (రజతం), శివనందిని (రజతం), గంగాభవాని (రజతం), జోహితశ్రావ్య (రజతం), గంగునాయుడు (కాంస్యం), ధరణి (కాంస్యం), హిమవర్షిని (కాంస్యం), సహస్ర (కాంస్యం), స్వాతి (కాంస్యం), జాహ్నవి (కాంస్యం).

పండుగ సరుకుల కోసం వస్తుండగా..

- ఆటోను ఢీకొన్న కారు
- ముగ్గురికి తీవ్ర గాయాలు



బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గోపవరం : మండలంలోని మడకలవారిపల్లె వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురం ఎస్సీకాలనీకి చెందిన పది మంది ఆటో తీసుకుని సంక్రాంతి పండుగ సందర్భంగా సరుకుల కోసం బద్వేలుకు వస్తుండగా మడకలవారిపల్లె వద్ద వెనుక నుండి వస్తున్న కారు అతివేగంగా ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మంచాల వెంగమ్మ, కాకి వెంగమ్మ, కాకి నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే గాయపడిన వీరిని అదే ఆటోలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆటోను ఢీకొన్న వెంటనే ఆపకుండా వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న బద్వేలు రూరల్ పోలీసులు సీసీ కెమెరాల ద్వారా కారు వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నారు. గాయపడిన వారికి బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించనున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో వీఆర్ఏ మృతి



ప్రతాప్ (ఫైల్)

లింగాల : లింగాల మండలం పెద్దకుడాల గ్రామానికి చెందిన వీఆర్ఏ ప్రతాప్ (43) అనే వ్యక్తి శుక్రవారం విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ హృషికేశవరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం ఆయన పొలంలో గట్లకు గడ్డి మందు స్ప్రే చేసేందుకు వెళ్లారని.. పొలం గట్టుపై ఉన్న ముళ్ల కంచెను దాటుతుండగా విద్యుత్ షాక్ సంభవించి అక్కడికక్కడే మృతి చెందారన్నారు. ఆయనకు భార్య సంతోషమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. ఆయన మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించామన్నారు. మృతుడి భార్య సంతోషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శేషారెడ్డి, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది మృతుడి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్‌గా చంద్రశేఖర్



రాయచోటి అర్బన్ : ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్‌గా రౌతు చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆసంఘం జిల్లా ఉపాధ్యక్ష, కార్య దర్శులు మారుతి, కుంచెపు రెడ్డెయ్య, చల్లా రెడ్డెయ్య తెలిపారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం మేరకు శుక్రవారం జిల్లా వడ్డెర విద్యావంతుల వేదిక కార్యాలయంలో కార్యవర్గం సమావేశం జరిగిందన్నారు. చర్చ అనంతరం ఇప్పటివరకు కన్వీనర్‌గా ఉన్న కుర్రపోతుల జీవానందంను తొలగించి అతని స్థానంలో రౌతు చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలం కర్మలవారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ గోదాం వెనుక వైపు పేకాట ఆడుతున్న 5 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 47 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు మైలవరం ఎస్ఐ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. మోహన్, చిట్టిబాబు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యంవీ రామచంద్రారెడ్డి
- ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశం



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యంవీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని.. తనను గెలిపించాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యంవీ. రామచంద్రారెడ్డి కోరారు. శనివారం కడపలో ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి కార్యాలయంలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులు గుజ్జల తిరుపాల్, రామక్రిష్ణంరాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ రెడ్డి, మోపూరు వెంకట శివారెడ్డి, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషన్‌రెడ్డి, విజయకుమార్, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి , ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, ఎస్‌ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరావు, గంగరాజుయాదవ్, అపూస్మ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగయ్య, పీఎస్‌టీయూ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ హక్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చెన్నపల్లె ఓబుల్‌రెడ్డి, పీఆర్‌టీయూ గౌరవాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితర ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

- ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మోసం
- జీర్ణించుకోలేక బలవన్మరణం



ఇంద్రసేనారెడ్డి మృతదేహం

రాజంపేట : మండలంలోని బోయనపల్లెలో ఇంజినీరింగ్ విద్యార్థి ఇంద్రసేనారెడ్డి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తాను నివసిస్తున్న గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. శ్రీశైలంకు చెందిన ఈ విద్యార్థి బీటెక్ మెకానికల్ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. బలవన్మరణం చేసుకునే ముందు తండ్రికి లేఖ రాశాడు. థర్డ్‌పార్టీ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయానని , అందుకే ఆత్మహత్య చేసుకొని చనిపోతున్నానని ఆ లేఖలో పేర్కొన్నాడని రూరల్ ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. తండ్రి కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పెద్దాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, సంబంధీకులకు అప్పగించారు. తోటి విద్యార్థులు స్నేహితుని మృతదేహాన్ని చూసేందుకు పెద్దాసుపత్రికి తరలివచ్చారు.

నాటు తుపాకులు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుతుపాకులు


మదనపల్లె : నాటుతుపాకులు స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అన్నమయ్య జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదనపల్లెలోని తాలూకా పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ కేశప్ప వివరాలు తెలిపారు. ఈ నెల 10వ తేదీన కొత్తవారిపల్లె పంచాయతీ నాయనవారి పల్లె గ్రామానికి చెందిన మండెం శ్రీనివాసులు(52)ను అరెస్ట్‌చేసి అబ్బగొంది చెరువు వద్ద సింగిల్ బారెల్ నాటుతుపాకీని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ క్రమంలోనే పోతపోలు పంచాయతీ మల్లయ్యదేవరపల్లెకు చెందిన చిన్నరెడ్డోరి రామమోహన్(30), దాసరయ్యగారి వెంకటాద్రినాయుడు(45), కుంటబాల కృష్ణ(35)లు కూడా లైసెన్స్ లేకుండా నాటుతుపాకులు కలిగి ఉన్నట్లు తెలుసుకుని వారిని అదుపులోకి తీసుకుని.. నాటు తుపాకులు స్వాధీనం చేసు కున్నామన్నారు. విచారణలో నాటుతుపాకులు తమ పూర్వీకుల ద్వారా వచ్చినట్లు నిందితులు తెలిపారని డీఎస్పీ చెప్పారు. ఈ కేసుల్లో కీలకంగా పనిచేసిన మ దనపల్లె తాలూకా పోలీస్‌సిబ్బంది ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం, హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్, రమేష్, పీసీలు మధుకర్ నాయక్, కృష్ణమూర్తి, ప్రభాకర్, జయచంద్రరెడ్డి తదితరులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించా రు. సమావేశంలో సీఐలు సత్యనారాయణ, ఎస్ఐలు సుధాకర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా



ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లె – చిన్నఓరంపాడు ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. అయితే పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. చిన్న ఓరంపాడు బీసి కాలనీకి చెందిన సాయి శుక్రవారం తెల్లవారుజామున ఓబులవారిపల్లె నుంచి చిన్నఓరంపాడుకు కారులో వస్తుండగా పాములేరు వంక దాటిన తరువాత స్పీడు బ్రేకర్ వద్ద అతి వేగం కారణంగా కారు బోల్తా పడింది. కారులో ఒకరే ఉండటంతో ఎటువంటి గాయాలు కాలేదు. కాగా ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు అయ్యింది.

తైక్వాండోలో సత్తా చాటిన తెలుగు తేజం



బనశంకరి : తెలుగు విద్యార్థిని జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ –2023 పోటీల్లో సత్తాచాటింది. ఈనెల 11న కార్డేలియా క్రూజ్, అరేబియా సముద్రంపై కర్ణాటక ఆటలు, తైక్వాండో అకాడమి నిర్వహించిన జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీలోని అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం కురబలకోట మండలం యర్రపల్లి గ్రామానికి చెందిన కేఆర్.బస్విత‌రెడ్డి స్వర్ణపతకం సాధించింది. యర్రపల్లి గ్రామానికి చెందిన అమరనాథరెడ్డి , కేఆర్.రమ దంపతుల కుటుంబం బెంగళూరు నగరంలోని గంగానగర కృష్ణప్ప లే అవుట్‌లో నివాసం ఉంటోంది. వీరి కుమార్తె కేఆర్.బస్వితారెడ్డి వయ్యాలికావల్ స్టెల్లా మెరీస్ హైయర్ ప్రైమరీ స్కూల్‌లో 5వ తరగతి చదువుతూ తైక్వాండోలో శిక్షణ పొంది పలు పోటీల్లో పాల్గొంటోంది. స్వర్ణ పతకం సాధించిన కేఆర్.బస్వితారెడ్డిని పాఠశాల సిబ్బంది యజమాన్యం అభినందించింది.

క్లుప్తంగా

రైతులోకం మాసపత్రిక ఆవిష్కరణ

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘానికి చెందిన రైతు లోకం మాసపత్రికను శుక్రవారం కడప మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంగారు నాగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పత్రిక రైతులకు సంబంధించిన అన్ని విషయాలను అందిస్తోందని, రైతులు చదవాలని కోరారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని అభిప్రాయపడ్డారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు జయన్న, సహాయ కార్యదర్శి బాలచంద్రయ్య, జిల్లా సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, భద్రయ్య, పక్కీరప్ప, ఇన్సాఫ్ నగర కార్యదర్శి మైనుద్దీన్‌లు పాల్గొన్నారు.

తాత్కాలిక సర్దుబాటు రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఎస్‌జీటీ ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు కార్యక్రమాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌కు శుక్రవారం ఫ్యాప్టో నాయకులు వినతిపత్రమిచ్చారు. ఫ్యాప్టో నాయకులు రూట, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇక్బాల్, ఫ్యాప్టో కడప జిల్లా సెక్రటరీ జనరల్ షేక్ మహమ్మద్ ఇర్షాద్, యూటీఎఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు గురవయ్య పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌కు నోటీసులు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : దేశంలోని ముస్లింలపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై కోర్టు ఆయనకు సుమోటోగా నోటీసులు ఇవ్వాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుల కేసీ బాదుల్లా కోరారు. శుక్రవారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 14, 15కు, సెక్యులర్ సామ్యవాద వ్యవస్థకు తూట్లు పొడిచే విధంగా ఆయన మాట్లాడటం విచారకరమని పేర్కొన్నారు. మత విశ్వాసాలు, పౌరసత్వంపై ప్రపంచంలోనే ఏ దేశంలో లేని విధంగా భారతదేశంలో ప్రత్యేకత ఉందని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని గుర్తు చేశారు. విభిన్న జాతులు, మతాల మధ్య చిచ్చుపెట్టే ఆధిపత్యధోరణి ప్రదర్శించాలన్న ఆలోచన మానుకోవాలని హితవు పలికారు. ఈసమావేశంలో ఇన్సాఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శి షాజహాన్, మైనుద్దీన్‌లు పాల్గొన్నారు.

రేపు కాలాష్టమి పూజలు

కడప కల్చరల్ : బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామం మగ్దూం సాహెబ్ కొట్టాలలో ఆదివారం శ్రీఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నామని బాసట సంస్థ అధ్యక్షులు బాలాజీరావు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 8గంటలకు అభిషేకం, అష్టోత్తరం, కుష్మాండ సేవ తదితర పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇంక్రిమెంట్‌తో కూడిన పదోన్నతులను కల్పించాలి

– ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు అక్టోబర్ నెలలో జరిగిన పదోన్నతులకు అంగీకారం తెలిపిన ఎస్‌జీటీలకు పూర్తిస్థాయితో కూడిన పదోన్నతులను కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదోన్నతులకు అంగీకారం తెలిపి మూడు నెలలు పూర్తయిన తర్వాత కూడా పూర్తిస్థాయిలో ఇంక్రిమెంట్లతో కూడిన పదోన్నతుల ఇవ్వకపోవడం సరైన విధానం కాదన్నారు. ఈ ఉత్తర్వుల వల్ల ఉపాధ్యాయుల్లో గందరగోళ వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ గురయ్య, ఖాదర్‌బాషా, కడప మండల అధ్యక్షుడు ప్రసాద్, చింతకొమ్మదిన్నె మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రమణ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు వితరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలోని మదర్ థెరిసా సేవా వృద్ధాశ్రమానికి ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో రూ.40వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులను తొగటవీరక్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము సంపాదించిన దానిలో వృద్ధులకు సహకారం అందించాలనే ఉద్దేశంతో బియ్యం, కందిపప్పు, నూనె తదితర నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సంస్థ నిర్వాహకుడు విష్ణువర్ధన్, చౌడం రవి రామయ్య పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో అన్నమాచార్య కీర్తనల ఆలాపన, కోలాటం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

సంక్రాంతి సంబరం ఆరంభం

కడప కల్చరల్: ఇంటింటా సంక్రాంతి సంబరాలు ఆరంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం కడప శిల్పారామంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ముడియం హేమలత, ఉద్దండపు సుష్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. మిస్బా మూవీ నిర్వాహకులు పద్మాకర్ పర్యవేక్షణలో 30 మందికి పైగా యువతులు, మహిళలు ఈ పోటీలో పాల్గొన్నారు. బహుమతి ప్రదానం కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలలో రంగవల్లులకు గల ప్రాధాన్యత, ముగ్గుల చరిత్ర గురించి వివరించారు. ఆకర్షణీయంగా ముగ్గులు తీర్చిదిద్దేందుకు, పోటీలో నెగ్గేందుకు పలు మెళుకువలను తెలిపారు. పోటీలో ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 3 వేలు, తృతీయ బహుమతిగా రూ. 2 వేలు అందజేశారు. మరో ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



కేఎల్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో భోగిమంట వేస్తున్న కేఎస్‌ఆర్‌ఎం ఎండీ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులంతా సాంప్రదాయ దుస్తులతో వచ్చి అందరినీ అలరించారు. కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించడం ,ఉట్టి కొట్టడం, భోగి మంటలు వేసి సంబరాలు, పొంగళ్లు పెట్టడం వంటి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కడప నగర సమీపంలోని కేఎస్‌ఆర్‌ఎం, కేఎల్‌ఎం, శ్రీనివాస, ఎస్వీ ఇంజనీరింగ్, శ్రీ సాయి కాలేజ్‌లలో సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు.

ముంగిట ముగ్గులు

కడప సిటీ : కడప కలెక్టరేట్‌లోని సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయం సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కార్యాలయ ఆవరణలో వేసిన రంగవల్లులు ప్రతి ఒక్కరినీ ఆకర్శిస్తున్నాయి. అక్కడున్న మహిళా సిబ్బంది వీటిని అందంగా తీర్చిదిద్దారు. అలాగే ముగ్గులను పరిశీలించి ఏడీ వేణుగోపాల్‌రెడ్డి మహిళా ఉద్యోగులను అభినందించారు.

నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



కడప కార్పొరేషన్: భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ కె. సురేష్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. రైతులు పండించిన పంటలు చేతికొచ్చే సందర్భంలో జరుపుకునే ఈ పండుగను ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.



యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు



శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



శిల్పారామంలో ముగ్గుల పోటీ విజేతలతో నిర్వాహకులు



సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రంగవల్లులు

జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పండుగ

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా
- 43వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పండుగ నెలకొందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 43వ డివిజన్‌లోని రవీంద్రనగర్, బుగ్గవంక పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ఈ ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని వివరించారు. గౌసియా అనే మహిళ మాట్లాడుతూ తన భర్త పన్నెండేళ్లక్రితం వదిలేశారని, తనకు నలుగురు ఆడ పిల్లలు ఉన్నారని, ఇంటి స్థలం ఇప్పించాలని కోరింది. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ ఆమెకు ఇంటి స్థలం మంజూరు చేయాలని వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. జీనత్ బేగం మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్సార్ పింఛన్ కానుక, చేయూత, అమ్మ ఒడి, ఇంటి స్థలం ద్వారా రూ.10.04లక్షల లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. షేక్ షాకీర్ అనే వ్యక్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తమ కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.10.01లక్షల మేలు జరిగిందని తెలిపింది. జగనన్నే ఈ రాష్ట్రానికి మళ్లీ సీఎం కావాలని వారు ఆకాంక్షించారు. 43వ డివిజన్ ఇన్‌చార్జి రెడ్డి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, తోటక్రిష్ణ, షఫీ, రామక్రిష్టారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మున్నా, లక్ష్మినారాయణ, అర్జున్, సింధేరవి, టీపీ వెంకటసుబ్బమ్మ, మూలే సరస్వతి, సుశీలమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

వైభవంగా శ్రీ గోదాదేవి కల్యాణోత్సవం

కడప కల్చరల్ : ధనుర్మాసం ముగింపునకు వస్తున్న సందర్భంగా శుక్రవారం కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి, స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత మూలమూర్తులతోపాటు ఉత్సవ మూర్తులకు కూడా విశేష అభిషేకాలు చేసి వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ బృందం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరైన భక్తులు కార్యక్రమం ముగిసేంతవరకు విష్ణు సహస్ర నామ పారాయణం చేయడం విశేషం. తొలుత ఉభయదారులకు, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కల్యాణంలో వాడిన అక్షతలు, ముత్యాలను భక్తులకు కానుకగా అందజేశారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సచివాలయాల సేవలను విస్తృతం చేయాలి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ ప్రభుత్వ సేవలు అందించాలని సత్సంకల్పంతో ఏర్పాటు చేసిన సచివాలయాల సేవలను విస్తృతం చేయాలని రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డిలు తెలిపారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం మండల సచివాలయాల కన్వీనర్ల సంఘం మండల కన్వీనర్‌గా సుమిత్రా రాజశేఖర్‌రెడ్డిని, పట్టణ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడిగా నిఖిల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం వారిని ఘనంగా సత్కరించారు. డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మస్తానయ్య, రామసుబ్బారెడ్డి, మర్రి సుబ్బన్న, చిన్ని, మైసూరారెడ్డి పాల్గొన్నారు.

మహిళాశక్తికి మార్కెటింగ్ కల్పించడమే ధ్యేయం

– ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప కల్చరల్: స్వశక్తిపై నిలబడాలన్న కాంక్షతో బ్యాంకులు ఇచ్చే సౌకర్యాన్ని అందిపుచ్చుకుని రూపొందించే మహిళల ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ కల్పించడమే తమ ధ్యేయమని ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ అన్నారు. స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో ఏపీజీబీ, నాబార్డుల సంయుక్తాధ్వర్యంలో గ్రామీణ ఉత్పత్తుల మేళాకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మహిళలు తమ స్వయం శక్తిని నిరూపించుకునేందుకు దీన్ని మంచి అవకాశంగా తీసుకోవచ్చన్నారు. నాబార్డు జీఎం పి.జయకణ్ణన్ మాట్లాడుతూ మహిళా శక్తి దేశాన్ని ప్రభావితం చేయగలదని, వారిని ఇంటికే పరిమితం చేయక వారిలోని శక్తి యుక్తులను వెలికి తీసి అటు సమాజానికి పనికి వచ్చేలా, ఇటు వారి జీవితాలు అభివృద్ధి చెందేలా మార్చుకోవచ్చన్నారు. అతిథులతో కలిసి మేళాలో ఏర్పాటు చేసిన దాదాపు 70 స్టాల్స్‌ను పరిశీలించి తయారీ, ఖర్చు తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ విజయ్‌విహారి, ఏపీజీబీ రిటైర్డ్ మేనేజర్ జానమద్ది విజయభాస్కర్, దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఓబులదాస్ పాల్గొన్నారు.



మేళాలో వివిధ ఉత్పత్తులను గురించి తెలుసుకుంటున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

వినియోగదారుల చట్టాలపై అవగాహన ఉండాలి

కడప అర్బన్: వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత అన్నారు. శుక్రవారం కడపలోని నేక్‌నామ్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019, ఉచిత న్యాయ సహాయం, న్యాయసేవల అధికారచట్టం, నాల్సా పథకాల గురించి వివరించారు. పారా లీగల్ వాలంటీర్లు సురేష్ సహాయం, హారున్ పాల్గొన్నారు.

17న పోస్టాఫీసులో పాసుపుస్తకాల తనిఖీ

కమలాపురం : స్థానిక పోస్టాఫీసులో ఈనెల 17 నుంచి రెండు రోజుల పాటు పాసు పుస్తకాలు తనిఖీ చేస్తామని సబ్‌డివిజన్ పోస్టు ఆఫీసర్ సుశీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో కమలాపురం పోస్టాఫీసులో ఏజెంట్ ఖాతాదారులను మోసం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కమలాపురం పోస్టాఫీసులో ఖాతాదారుల పాసు పుస్తకాలు తనిఖీ చేయడానికి అధికారులు వస్తున్నారని ఆయన అన్నారు. డైరెక్ట్‌గా కానీ, ఏజెంట్ ద్వారా గాని అకౌంట్ ఓపెన్ చేసిన వారు తమ పాసు పుస్తకాలను ఈ రెండు రోజుల్లో పోస్టాఫీసుకు తీసుకువచ్చి తనిఖీ చేయించుకోవాలన్నారు.

ధ్యాన మందిరం ప్రారంభం




పిరమిడ్ ధ్యానమందిరం, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న డి.ఐ.జి సెంథిల్‌కుమార్

కడప అర్బన్: కడపలోని నూతన పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పిరమిడ్ ధ్యాన మందిరం, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్ట్, టెన్నిస్ కోర్ట్, షటిల్ కోర్ట్‌లను శుక్రవారం సాయంత్రం కర్నూలు రేంజ్ డి.ఐ.జి ఎస్. సెంథిల్‌కుమార్ ప్రారంభించారు. పోలీసు సిబ్బంది ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలనీ డి.ఐ.జి సూచించారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలపై నిషేధాన్ని తొలగించాలని ధర్నా

ప్రొద్దుటూరు : ఫ్లెక్సీలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి సృజన శ్రీను, సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వం విధించిన ఫ్లెక్సీల నిషేధం వల్ల నిరుద్యోగులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ సుభానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మానుయేల్, విజయకుమార్‌తోపాటు ఫ్లెక్సీ ప్రింటర్స్ షాపుల యజమానులు పాల్గొన్నారు.



లయన్ మెల్విన్ జోన్స్ సేవలు ప్రపంచ వ్యాప్తం

కడప కల్చరల్ : లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్‌ను స్థాపించిన అమెరికాకు చెందిన మెల్విన్‌జోన్స్ సేవలు ప్రపంచ వ్యాప్తంగా అప్రతిహతంగా కొనసాగుతున్నాయని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మానస చిన్నపరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక హోటల్ గ్రాండ్ ఇన్‌లో మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ సాధారణ ఇన్స్యూరెన్స్ ఏజెంటుగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన లక్షలాది మందికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, కొండారెడ్డి, లయన్ చిన్నప్పరెడ్డి, లయన్ గునిశెట్టి, లయన్ జనార్దన్‌రాజు, ఓం శాంతి పవన్‌కుమార్, నారు నాగరాజ పాల్గొన్నారు.



లయన్ మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కడప లయన్స్ బృందం

తెలుగుదేశం పార్టీకి ఇదేం ఖర్మ

- ఇదే ప్రజలందరి భావన
- సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుంటే తెలుగుదేశం పార్టీకి ఏం ఖర్మ పట్టి నిరసన కార్యక్రమాలు చేస్తోందని ప్రజలు అనుకుంటున్నారని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యులు నరేన్ రామాంజులరెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నవరత్న పథకాల పునాదులపైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. పింఛన్ ఇచ్చే వయసును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించి 64లక్షల మందికి రూ.2750 చొప్పున పింఛన్ ఇస్తున్నారన్నారు. విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్య నందించేందుకు అమ్మ ఒడి, నాడు–నేడు, విద్యాదీవెన, గోరుముద్ద, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తూ రూ.54910కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఆలోచనల మేరకు సమన్యాయం, సామాజిక న్యాయం దిశగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ 17 మందికి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. సంక్షేమ పథకాలు అమలైతే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని, కోర్టులకు పోయి అడ్డుకున్న చరిత్ర చంద్రబాబుదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల వల్లే నిత్యావసర ధరలు పెరిగాయని, రాష్ట్ర ప్రభుత్వానికి ఇందులో ఏం సంబంధముందని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్‌లు పాదయాత్ర చేసినా, బస్సుయాత్ర చేసినా, పొర్లుదండాలు పెట్టినా టీడీపీ అధికారంలోకి రాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టిస్తే, చంద్రబాబు రాష్ట్రానికి ఏమీ చేయకుండా చరిత్ర హీనుడిగా మిగిలిపోయారన్నారు. ఆత్మఘోష, కంఠశోష తప్పా వారికేం మిగలదని ఎద్దేవా చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, పార్టీ నాయకులు సుబ్బరాయుడు, క్రిష్ణయ్య, శ్రీనివాసులు, శ్రీనుయాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీకేదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి

పేద ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. చెన్నూరు మండల ప్రజారిషత్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, గతంలో ఎన్నడూలేని విధంగా వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 104 ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందే విధంగా ఫ్యామిలీ ఫిజిషియన్(ఫ్యామిలీ డాక్టర్ల)చే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు తగినంతమంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడమే కాకుండా మెరుగైన వైద్య వసతులు కల్పించారన్నారు. చెన్నరులో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ఒకేచోట ఉండటంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రస్తుతం పీహెచ్‌సీని కొత్తగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లోకి మార్చడం ద్వారా కొండపేట, ఇటు చెన్నూరుటౌన్ వాసులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్ఓ ఉమామహేష్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామనశ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, పార్టీ చెన్నూరు టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఆర్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, మైనార్టీ నాయకులు, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

స్పర్శలేని పొడలపై వైద్యుల సలహాలు తప్పనిసరి

అట్లూరు : స్పర్శలేని, చెమట పట్టని రాగిరంగు పోలిన పొడలపై వైద్యుల సలహాలు తప్పనిసరి అని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.కె.ఖాదర్‌వల్లి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరికైనా శరీరంలో ఎక్కడైనా స్పర్శ లేకుండా పొడలు ఉంటే అవి కుష్టువ్యాధి (లెప్రసీ)కి సంబంధించిన పొడలుగా గుర్తించాలని, వైద్యులను సంప్రదిస్తే వాటికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నివారణకు చర్యలు చేపట్టి ఉచితంగా వైద్యంతో పాటు మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ కె.హమీదాబేగం, సీహెచ్ఓ మురళీకృష్ణ, డీపీఎంఓ నాగరాజు, టెక్నికల్ సపోర్ట్ శంకర్, మధుసూదన్, పీహెచ్ఎన్ లక్ష్మిదేవి, ఏఎన్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
14-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 303	నిఫ్టీ ▲ 98
60,261	17,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,978	▽	23
డోజోన్స్	34,193	▲	3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,844	▲	50
డాక్స్	15,087	▲	28
షాంఘై	3,195	▲	31
నికాయ్	26,120	▽	330

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
56,462	▲	352
బంగారం (99.5 స్వచ్ఛత)		
56,236	▲	351
వెండి (కేజీ)		
68,115	▲	90

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయుడికి	79.50	83.18
£	బ్రిటన్ పౌండ్	భారతీయుడికి	96.84	101.69
€	యూరో	భారతీయుడికి	85.71	90.23
¥	జపాన్ ఎన్ (100)	భారతీయుడికి	50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయుడికి	54.20	59.09
S$	సింగపూర్ డాలర్	భారతీయుడికి	59.21	63.76
SAR	సౌదీ రియాల్	భారతీయుడికి	20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయుడికి	21.25	23.04
¥	చైనా యువాన్	భారతీయుడికి	10.98	13.01

డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-1-2023	
విశాఖ	572-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	563-00
విజయవాడ	563-00
రిటైల్ ధర (డజను)	84.00
13-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5-12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.



ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

డీల్స్ రికార్డ్..

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి-మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇతర హైలైట్స్

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

3 రోజుల నష్టాలకు చెక్

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్లు దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3-0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2-1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే, ఎల్‌అండ్‌టీ 1-0.5 శాతం మధ్య క్షీణించాయి.



స్టాక్ హైలైట్స్

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్‌ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తతమైన అవకాశాలున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.

ఇతర రంగాలకూ పీఎల్‌ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్‌ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60 శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.



పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్‌ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్‌ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్‌ఎంఈలను జీవీసీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్‌ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్‌ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

సాక్షి స్పోర్ట్స్



నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్

మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.



భారత్ శుభారంభం

నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1-0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8-0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5-0తో వేల్స్ జట్టును ఓడించింది.



అమిత్ రోహిదాస్

8 ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదో సారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం 17-21, 22-20, 21-9తో లియు యు చెన్-జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16-21, 21-19, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆంధ్ర జట్టుకు నిరాశ

ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం



హిమ్మత్

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.

భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరో వైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.



సూర్య, ఇషాన్


న్యూజిలాండ్‌దే సిరీస్

కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.



భరత్

వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.